క్లుప్తంగా

రేపు గుళ్లాపల్లి గ్రోత్ సెంటర్‌లో మాక్ డ్రిల్

ఒంగోలు: రసాయన ఫ్యాక్టరీల్లో ప్రమాదాల నివారణలో భాగంగా అత్యవసర సమయాల్లో ఎలా స్పందించాలనే దానిపై మాక్ డ్రిల్ నిర్వహించనున్నట్లు డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, జిల్లా నోడల్ అధికారి కె.పరమేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 7వ తేదీ ఉదయం 8 గంటలకు మద్దిపాడు మండలం గుళ్లాపల్లి గ్రోత్ సెంటర్‌లోని గ్లోసెల్ కెమికల్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్, కేవీస్ జెనరిక్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీల వద్ద ఈ మాక్ డ్రిల్ ఉంటుందన్నారు. జిల్లాలోని అన్ని ఫ్యాక్టరీల వారు ప్రమాదాల నివారణకు అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు.

ఎస్టీ కాలనీని సందర్శించిన ఎన్నారై నెప్పల

నాగులుప్పలపాడు: మండలంలోని మద్దిరాలపాడు గ్రామానికి చెందిన ప్రవాస భారతీయుడు నెప్పల సుబ్బారాయుడు మంగళవారం గ్రామంలోని ఎస్టీ కాలనీని సందర్శించారు. కాలనీ వాసుల స్థితిగతులు, మౌలిక వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. కాలనీకి చెందిన ఆదిలక్ష్మికి ఇంటి స్లాబు నిర్మాణానికి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కాలనీలో మౌలిక వసతులను కల్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఆయన సతీమణి నెప్పల శారద, వెంకటరావు, నెప్పల ప్రభుదాసు, ఉప్పుటూరు రాజశేఖర్ పాల్గొన్నారు.

బీసీ సామాజిక సమావేశాలు విజయవంతం చేయాలి

ఒంగోలు సెంట్రల్: జిల్లాలో ప్రతి మండలంలో నిర్వహించనున్న బీసీ సామాజిక సమావేశాలు విజయవంతం చేయాలని పార్టీ ఓబీసీ మోర్చా జిల్లా సెక్రటరీ దండు శ్రీనివాసరావు కోరారు. రాష్ట్ర ఓబీసీ అధ్యక్షుడు రొంగల గోపి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు తనికొండ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రతి గ్రామంలో యువజన బీసీ సమావేశాలు నిర్వహిస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో చేపట్టిన పలు పథకాలను వివరించనున్నట్లు తెలిపారు.

7 వైఎస్సార్ ఆసరా సంబరాలు

ఒంగోలు రూరల్: మండలంలోని కరవదిలో ఈ నెల 7న వైఎస్సార్ ఆసరా సంబరాలు నిర్వహించనున్నట్లు ఏపీఎం గోపినాథ్ తెలిపారు. కార్యక్రమానికి మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తారన్నారు. కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు పాల్గొనాలని కోరారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



అభ్యర్థులకు యూనిఫాం అందజేస్తున్న డీఆర్‌డీఏ పీడీ వసుంధర

ఒంగోలు టౌన్: నిరుద్యోగ యువత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ టి.వసుంధర అన్నారు. స్థానిక టీటీడీసీ భవనంలో ఎస్‌ఆర్‌టీపీ ట్రైనింగ్ సెంటర్లో సీడాప్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేల్స్ సూపర్‌వైజర్ శిక్షణను మంగళవారం ఆమె పరిశీలించారు. శిక్షణ పొందుతున్న అభ్యర్థులకు యూనిఫాం అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ ఉపాధి విజయవంతంగా రాణించేందుకు ప్రభుత్వం శిక్షణ ఇస్తుందన్నారు. జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన గ్రామీణ ప్రాంత యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉద్యోగ ఉపాధి అవకాశాలు పొందాలన్నారు. శిక్షణలో ఉచితం భోజనంతో పాటుగా యూనిఫాం కిట్లు, ట్రైనింగ్ మెటీరియల్ అందజేస్తామన్నారు. శిక్షణలో జేడీఎం డి.రజనీకాంత్, ట్రైనర్లు కేవీ ప్రభాకర్‌రావు, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కాలభైరవ స్వామికి సన్మానం

ఒంగోలు మెట్రో: పద్య సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో ఎర్రన్న సాహిత్య పరిత్ అధ్యక్షుడు గిడుగు రామమూర్తి అవార్డు గ్రహీత కాలభైరవ స్వామి మైనంపాటి సాయికుమార్‌ను ఘనంగా సన్మానించారు. స్థానిక రాజీవ్‌నగర్‌లోని పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉదయం పద్యసారస్వత పరిషత్ జాతీయ అధ్యక్షుడు చదలవాడ లక్ష్మీనరసింహారావు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి పింగళి పూర్ణచంద్రరావు, మహిళ కార్యదర్శి కురిచేటి ఝాన్సీ లక్ష్మీబాయి, సభ్యులు పింగళి శ్రీనివాసరావు, సభ్యులు చదలవాడ పాండురంగారావు, చదలవాడ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



మైనంపాటిని సన్మానిస్తున్న పరిషత్ జాతీయ అధ్యక్షుడు చదలవాడ లక్ష్మీనరసింహారావు

పేదలకు 24 గంటలూ వైద్య సేవలు

- మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి
- త్రోవగుంటలో రూ.1.55 కోట్లతో నిర్మించిన అర్బన్ హెల్త్ సెంటర్ ప్రారంభం



త్రోవగుంటలో అర్బన్ హెల్త్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి, పక్కన మేయర్ గంగాడ సుజాత

ఒంగోలు రూరల్: బడుగు, బలహీన వర్గాల వారికి, నిరుపేదలకు 24 గంటల పాటు వైద్య సేవలు అందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. నగరంలోని త్రోవగుంట 1వ డివిజన్‌లో నిర్మించిన అర్బన్ హెల్త్ సెంటర్‌ను మంగళవారం త్రోవగుంట ప్రజలకు అంకితం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలినేని మాట్లాడుతూ వైద్యానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని గుర్తు చేశారు. రూ.1.55 కోట్లతో అర్బన్ హెల్త్ సెంటర్‌ను నిర్మించామన్నారు. నగర శివారు ప్రాంతాలకు కూడా అర్బన్ హెల్త్ సెంటర్లను నిర్మించి వైద్యం అందుబాటులో ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నామని వెల్లడించారు. ఆధునిక సౌకర్యాలతో కూడిన ఆపరేషన్ థియేటర్, డెలివరీ రూమ్, వివిధ రకాలైన రక్త పరీక్షలు చేసేందుకు కంప్యూటరీకరణ చేసిన ల్యాబ్ నిర్మించామన్నారు. కొద్ది రోజుల్లోనే పూర్తి స్థాయి ఆధునిక టెక్నాలజీతో కూడిన స్కానింగ్, ఈసీజీ, ఎంఆర్‌ఐ స్కానింగ్ ఈ అర్బన్ హెల్త్ సెంటర్‌కు రానున్నాయని ఆయన స్పష్టం చేశారు. పూర్తి స్థాయి వైద్యులను, సిబ్బందిని నియమించామన్నారు. త్రోవగుంట, ముక్తినూతలపాడు, గుడిమెళ్లపాడు, పలు కాలనీల ప్రజలు 24 గంటలుపాటు ఈ కేంద్రాన్ని ఆరోగ్య అవసరాల నిమిత్తం వాడుకోవచ్చునని తెలిపారు. నగర మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వైద్యరంగానికి , విద్యారంగానికి పెద్దపీట వేస్తుందన్నారు.దశాబ్దాలుగా శిథిలమైన సబ్ సెంటర్‌లను తొలగించి అర్బన్ హెల్త్ సెంటర్‌గా ప్రాథమిక పట్టణ వైద్యారోగ్య కేంద్రాలుగా ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి విశేష కృషి చేశారన్నారు. త్వరలో త్రోవగుంట జెడ్పీ హైస్కూల్, ముక్తినూతలపాడు జెడ్పీ హైస్కూల్‌ను ప్రారంభించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ రాజ్యలక్ష్మి, కార్పొరేటర్ సామ్రాజ్యం ప్రభాకర్‌రావు, వైఎస్సార్ సీపీ నాయకులు కట్టా గోపి, కట్టా సింగయ్య, చైర్మన్ రాయపాటి అంకయ్య, సచివాలయ వీఆర్‌ఓ ఎస్ దాస్, నాయకులు, కార్యకర్తలు, వైద్యులు, సచివాలయ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు విభాగాలను డీఎంహెచ్‌ఓ, కార్పొరేటర్, కట్టా సింగయ్య, ప్రభాకర్ రావు, అధికారులు ప్రారంభించారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ



10వ డివిజన్‌లో కమ్యూనిటీ హాలుకు భూమిపూజ చేస్తున్న బాలినేని

ఒంగోలు సబర్బన్: నగరంలోని 9వ డివిజన్ రాజీవ్ గృహకల్ప నాలుగో లైన్‌లో ఉడా నిధులు రూ.50 లక్షలతో చేపట్టనున్న పనులకు మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి మంగళవారం శంకుస్థాపన చేశారు. శిలాఫలకాన్ని ఆవిష్కరించటంతో పాటు కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు. అదేవిధంగా 10వ డివిజన్‌లో గాంధీనగర్‌లో కమ్యూనిటీ హాలు, ప్రహరీ నిర్మాణానికి బాలినేని భూమిపూజ చేశారు. రూ.74 లక్షలతో నిర్మాణాలు చేపడుతున్నారు. కార్యక్రమంలో మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ ఎం.జశ్వంత రావు, ఉడా చైర్మన్ శింగరాజు వెంకట్రావు మీనా కుమారి, కార్పొరేటర్లు వెన్నపూస శోభారాణి వెంకటరెడ్డి, బెంగుళూరు నర్సయ్య, పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.



9వ డివిజన్‌లో పార్కు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

దళిత, బడుగులను అక్కున చేర్చుకున్న జగనన్న



చీమకుర్తిలో ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న మంత్రి మేరుగు నాగార్జున, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి ఇన్‌చార్జి బూచేపల్లి శివప్రసాదరెడ్డి

- ఆరోగ్యశ్రీ ద్వారా రూ.25 లక్షల వరకు కార్పొరేట్ వైద్యసేవలు
- సంతనూతలపాడులో మరోసారి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేద్దాం
- మంత్రి మేరుగు నాగార్జున, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి ఇన్‌ఛార్జి బూచేపల్లి శివప్రసాదరెడ్డి



కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి మేరుగు నాగార్జున

చీమకుర్తి: గతంలో ఏ ముఖ్యమంత్రి చేరదీయని విధంగా రాష్ట్రంలోని దళిత, బడుగు బలహీనవర్గాల ప్రజలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అక్కున చేర్చుకున్నారని జిల్లా ఇన్‌చార్జి మంత్రి మేరుగు నాగార్జున అన్నారు. చీమకుర్తి అంబేడ్కర్ నగర్‌లో మంగళవారం రాత్రి నిర్వహించిన ఇళ్ల పట్టాలు పంపిణీ, కార్యకర్తల పరిచయ కార్యక్రమంలో మంత్రితో పాటు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి బూచేపల్లి శివప్రసాదరెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి నాగార్జున మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ ద్వారా పేద ప్రజలకు రూ.25 లక్షల వరకు కార్పొరేట్ వైద్య సదుపాయాలు కల్పించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. సీఎం అందిస్తున్న సంక్షేమ పథకాలను నిరంతరం పేదలకు అందించాలంటే తిరిగి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకోవాలన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, బూచేపల్లి శివప్రసాదరెడ్డి మాట్లాడుతూ సంతనూతలపాడు నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా మంత్రి మేరుగు నాగార్జునను అత్యధిక మెజారిటీతో గెలిపించాలన్నారు. అనంతరం స్థానికంగా ఉన్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను, నాయకులకు మంత్రిని పరిచయం చేశారు. తదుపరి పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గోపురపు రాజ్యలక్ష్మి, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ క్రిష్ణిపాటి శేఖరరెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు వేమా శ్రీనివాసరావు, డాక్టర్ బీ.జవహర్, మాజీ జెడ్పీటీసీ సభ్యులు గోగినేని వెంకటేశ్వర్లు, మాజీ మున్సిపల్ చైర్మన్ చల్లా అంకులు, స్థానిక కౌన్సిలర్లు తప్పెట బాబూరావు, గోగినేని అనసూర్యమ్మ, నలమల మాణిక్యం, పాటిబండ్ల గంగయ్య, సోమా శేషాద్రి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సామాజిక సేవలో అగ్రగామి ఫ్యామిలీ క్లబ్



ఫ్యామిలీ క్లబ్ వ్యవస్థాపక దినోత్సవంలో క్లబ్ సభ్యులు

ఒంగోలు మెట్రో: ఫ్యామిలీ క్లబ్ వ్యవస్థాపక దినోత్సవాన్ని సంస్థ అధ్యక్షుడు పొట్టి వీర రాఘవరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లబ్ స్థాపించి ఏడేళ్లు పూర్తయిందన్నారు. సంస్థ ద్వారా ఏడేళ్లలో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. సభ్యులు కూడా ఎంతో ఉత్సాహంగా ఆర్థిక పరిపుష్టత చేకూర్చారని, రానున్న రోజుల్లో సేవా కార్యక్రమాలు విస్తృతం చేస్తామన్నారు. తాళ్లూరి శ్రీనివాసరావు, కొత్తూరు సురేష్, తుమ్మపూడి పాండురంగారావు, తుమ్మపూడి వెంకటేశ్వర్లు, మద్దాలి మధు, సీహెచ్ రంగ సుబ్రహ్మణ్యం, సొల్లేటి రాము, పబ్బిశెట్టి శ్రీనివాసరావు, కొత్తూరి చంద్రమౌళి, పువ్వాడ విజయ్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలకు దరఖాస్తుల స్వీకరణ

చీమకుర్తి: ఏపీ గురుకుల పాఠశాలల్లో 5వ తరగతిలో ప్రవేశం పొందేందుకు అర్హత కలిగిన 4వ తరగతి విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఏపీ గురుకుల పాఠశాలల జిల్లా కన్వీనర్, సంతనూతలపాడు గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ నాగేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దానితో పాటు 6, 7, 8 తరగతులలో మిగిలిన ఖాళీలకు, దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలోని సంతనూతలపాడు, గణపవరం, అమ్మనబ్రోలు గురుకుల పాఠశాలల్లో చేరుటకు ఈ దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు తెలిపారు. వాటితోపాటు రాష్ట్రంలోని 7 రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీల్లో ఇంటర్ చేరేందుకు, నాగార్జున సాగర్‌లోనున్న రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజీ(బాలురు)లో చేరేందుకు అర్హత కలిగిన విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఈనెల 31వ తేదీలోపు సమర్పించాలని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఏప్రిల్ నెల 25వ తేదీ ప్రవేశ పరీక్షను నిర్వహిస్తున్నట్లు నాగేశ్వరరావు తన ప్రకటనలో పేర్కొన్నారు. సమర్పించాల్సిన సర్టిఫికెట్‌లు, ఇతర వివరాలకు వెబ్ సైట్ ద్వారా తెలుసుకోవాలన్నారు.

క్రీడలతో ఆరోగ్యం

వీసీ ప్రొఫెసర్ మారెడ్డి అంజిరెడ్డి



మ్యూజికల్ చైర్స్‌లో తలపడుతున్న విద్యార్థినులు



జెండా ఊపి పోటీలను ప్రారంభిస్తున్న వీసీ మారెడ్డి అంజిరెడ్డి

ఒంగోలు: క్రీడలతో ఆరోగ్యం సిద్ధిస్తుందని, యువత క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఏకేయూ వీసీ ప్రొఫెసర్ మారెడ్డి అంజిరెడ్డి అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా మంగళవారం యూనివర్శిటీలో నిర్వహించిన ఆటల పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం చేకూరుతుందన్నారు. మానసిక ఒత్తిడి కూడా గణనీయంగా తగ్గుతుందని పేర్కొన్నారు. మ్యూజికల్ చైర్స్, లెమన్ అండ్ స్పూన్, షాట్‌పుట్, టెన్నికాయిట్ ఆటలను నిర్వహించారు. విజేతలకు ఈనెల 8న యూనివర్శిటీలో జరిగే అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో బహుమతి ప్రదానం చేశారు.

పారిశుధ్యం, ఆహార పోషణపై వీఓఏలకు శిక్షణ



శిక్షణలో మాట్లాడుతున్న ఏపీఎం నరేంద్రకుమార్‌తో మాస్టర్ ట్రైనర్ గోపాల కృష్ణ

మద్దిపాడు: మండలంలోని వీఓఏలకు డీఆర్‌డీఏ, వైఎస్‌ఆర్ క్రాంతిపథం ఆధ్వర్యంలో ఆహారం పోషణ, ఆరోగ్యం పారిశుధ్యం వంటి అంశాలపై మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఏపీఎం నరేంద్రకుమార్ మంగళవారం నిర్వహించారు. మొదటి రోజు ఈశిక్షణా కార్యక్రమానికి మాస్టర్ ట్రైనర్‌గా వచ్చిన కొనకనమిట్ల ఏపీఎం కె గోపాల కృష్ణ వీఓఏలకు ఆరోగ్యం, ఆహార పోషణపై వివరించారు. అదేవిధంగా వ్యక్తిగత పారిశుధ్యంతోపాటు పరిసరాల పారిశుధ్యం పట్ల కూడా వారికి అవగాహన కల్పించాలని వీఓఏలకు తెలిపారు. మండలంలోని అన్ని స్వయం సహాయక సంఘాలకు సమావేశాలు ఏర్పాటు చేసి వారిని భాగస్వాములుగా చేయాలని తెలిపారు. కార్యక్రమంలో వారి వెంట సీసీలు మూర్తి, మోహనరావు, స్వర్ణలత, ప్రేమానందం, రైతు మిత్ర ప్రభుదాసు, అకౌంటెంట్ వెంకటరత్నం , అన్ని గ్రామాల వీఓఏలు పాల్గొన్నారు.

ఎమ్మార్సీకి కుర్చీల వితరణ



ఎంఆర్‌సీకి కుర్చీలను అందిస్తున్న శిద్దా హనుమంతురావు

చీమకుర్తి: కృష్ణసాయి గ్రానైట్ యజమాని శిద్దా హనుమంతురావు రూ.30 వేల విలువ చేసే 50 కుర్చీలను మంగళవారం సంతనూతలపాడులోని ఎంఆర్‌సీ కార్యాలయానికు అందించారు. ఎంఈఆర్‌సీ కార్యాలయంలో నిర్వహించే సమావేశాల కోసం సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఎంఈఓ విజ్ఞప్తి మేరకు అందించారు. ఈ సందర్భంగా హనుమంతురావు మాట్లాడుతూ రానున్న పదో తరగతి వార్షిక పరీక్షలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచిన విద్యార్థులకు వరుసగా రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలను బహుమతిగా అందిస్తానని తెలిపారు. అనంతరం ఎంఈఓతో పాటు స్థానిక ఉపాధ్యాయులు శిద్దా హనుమంతురావును శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ దుంపా రమణమ్మ, హైస్కూలు హెచ్‌ఎం పీ.రామారావు, టీచర్ ఎం.తిరుపతిరెడ్డి, వాసవీక్లబ్ నిర్వాహకులు, స్థానికులు పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలు అధిరోహించండి



విద్యార్థులకు క్రీడాదుస్తులు పంపిణీచేస్తున్న చావలి గోపి

ఒంగోలు: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని శివాజీ ఫౌండేషన్ చావలి గోపి అన్నారు. స్థానిక డీఆర్‌ఆర్‌ఎం మున్సిపల్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీతత్వంతో కూడిన సమాజంలోకి అడుగుపెడుతున్నామన్న స్పృహతో ముందుకు వెళ్లాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కూడా వీడ్కోలు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం నేటి తరం విద్యార్థుల అదృష్టంగా పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులకు క్రీడా దుస్తులు పంపిణీచేశారు. అనంతరం చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో హెడ్మాస్టర్ వెంకట్రావు, రమణా మాస్టర్, సురేష్, మురళి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మేలు చేయాలి



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

- జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

దర్శి: సకాలంలో పనులు పూర్తి చేసి ప్రజలకు మేలు చేయాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ సమావేశం హాలులో సర్వసభ్య సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా హాజరైన వెంకాయమ్మను ఘనంగా సత్కరించారు. అధికారులు తమ శాఖల్లో జరిగిన సంక్షేమం, అభివృద్ధి పనుల గురించి వివరించారు. ఈ సందర్భంగా వెంకాయమ్మ మాట్లాడుతూ ఎస్సీ కాలనీ, కొత్తపల్లి గ్రామాల్లో విద్యుత్ వైర్లు కిందకు వేలాడుతున్నాయని, మరికొన్ని చోట్ల భవనాలు తాకుతూ వెళ్తున్నాయని, వాటని వెంటనే మార్చి కొత్త లైన్‌లు వేయాలని కోరారు. రానున్న వేసవిలో తాగునీటి సమస్య లేకుండా వెంటనే ప్రత్యేక మోటార్లు పెట్టి ఎస్ఎస్‌పీ చెరువును నింపాలని కోరారు. గత శివప్రసాద్‌రెడ్డి హయాంలో ఏర్పాటు చేసిన రాఫిడ్ శాండ్ ఫిల్టర్ మాత్రమే ఉపయోగంలో ఉందని, గతంలో ఉన్న ఏడు ఫిల్టర్ బెడ్‌లు పూర్తిగా దెబ్బతిన్నాయని ప్రజాప్రతినిధులు వెంకాయమ్మ దృష్టికి తీసుకెళ్లారు. అద్దంకి రోడ్డులో రామాలయం వద్ద రోడ్డు గుంతలు పడి ఇబ్బందికరంగా ఉందని, వెంటనే ఆ పనులు పూర్తి చేయాలని వెంకాయమ్మ ఆదేశించారు. వచ్చే సర్వసభ్య సమావేశం నాటికి సభలో పనులన్నీ పూర్తి స్థాయిలో చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఎంపీడీఓ హనుమంతరావు, ఎంపీపీ సుధారాణి, పీఆర్ డీఈ విఠల్ రాథోడ్, ఎంఈఓ కాకర్ల రఘురామయ్య, ఏఓ బాలకృష్ణ నాయక్, సీడీపీఓ భారతి, వైస్ ఎంపీపీలు సోము దుర్గారెడ్డి, కొరివి ముసలయ్య, సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు కేసరి రామ్ భూపాల్‌రెడ్డి, సర్పంచ్‌లు రాము, సుబ్బారెడ్డి, ఎంపీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు బండి గోపాల్‌రెడ్డి, ఎంపీటీసీలు రత్నం పాల్గొన్నారు.

చదలవాడ రఘునాయకస్వామి ఆలయ నిర్మాణానికి రూ.97 లక్షలు

నాగులుప్పలపాడు: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం చదలవాడ రఘునాయకస్వామి ఆలయ పునః నిర్మాణంలో భాగంగా 5 అంతస్తుల రాజగోపురం నిర్మాణానికి రూ.97 లక్షలు నిధులు మంజూరైనట్లు సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున కార్యాలయ ప్రతినిధి తెలిపారు. సి.జి.ఎఫ్ నిధుల ద్వారా రూ.77.60 లక్షలు, మాచింగ్ కంట్రిబ్యూషన్ కింద రూ.19.40 లక్షల నిధులు మంజూరైనట్లు చెప్పారు. ఆలయ రాజగోపురం నిర్మాణానికి ఇటీవల ఆలయ కమిటీ సభ్యులు మంత్రి మేరుగు నాగార్జున ను కలిసి నిర్మాణానికి సహకరించాలని విన్నవించడంతో మంత్రి చొరవతో నిధులు మంజూరైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ గోపురం నిర్మాణానికి కృషి చేసిన మంత్రి మేరుగు నాగార్జునకు ఆలయ పాలక మండలి కమిటీ సభ్యులు చదలవాడ వెంకట కృష్ణయ్య, గుర్రం సుబ్బన్న, పెనుబోతు మల్లిఖార్జునరావు కృతజ్ఞతలు తెలిపారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

ఒంగోలు: ఓటు హక్కును యువత సద్వినియోగం చేసుకోవాలని పేస్ ఇంజినీరింగ్ కాలేజీ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ మద్దిశెట్టి శ్రీధర్ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మేరా పెహ్లా ఓట్ దేశ్ కేలియే అనే కార్యక్రమంలో భాగంగా మంగళవారం వల్లూరులో ర్యాలీ, విద్యార్థులకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు అమూల్యమైనదన్నారు. ఇది దేశ భవిష్యత్‌ను నిర్ణయిస్తుందని, ప్రతి ఒక్కరూ వినియోగించుకుంటూ ఇతరులు కూడా ఓటు సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీకే మూర్తి, తదితరులు పాల్గొని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

సత్యం కుటుంబాన్ని పరామర్శించిన బూచేపల్లి

దొనకొండ: దొనకొండకు చెందిన సాతరాశి సత్యం అనారోగ్యంతో నాలుగు రోజుల క్రితం మృతి చెందారు. ఈ సందర్భంగా దర్శి మాజీ ఎమ్మెల్యే, ఇన్‌చార్జి బూచేపల్లి శివప్రసాదరెడ్డి మంగళవారం సత్యం ఇంటికి వెళ్లి కుటుంబాన్ని పరామర్శించారు. సత్యం చిత్రపటానికి పూలమాల వేసి శివన్న నివాళులర్పించారు. ఆయన వెంట మాజీ కన్వీనర్ కాకర్ల కృష్ణారెడ్డి పాల్గొన్నారు.